ఆరోసారి ప్రపంచకప్ కైవసం

ఆసీస్ సిక్సర్

ఫైనల్లో టీమ్‌ఇండియా ఓటమి ● భారత్ 240; ఆస్ట్రేలియా 241/4 ● హెడ్ భారీ సెంచరీ

భారత్‌కు భంగపాటు!

ముచ్చటగా మూడోసారి విశ్వ విజేతగా నిలువాలనుకున్న టీమ్‌ఇండియాకు నిరాశ తప్పలేదు. పుష్కర కాలం తర్వాత స్వదేశంలో జరుగుతున్న టోర్నీలో అదరగొట్టే ప్రదర్శనతో ఫైనల్ చేరిన రోహిత్ సేన తుదిపోరులో ఆసీస్ చేతిలో కంగుతింది.

వరల్డ్‌కప్ ఆసాంతం దంచికొట్టిన బ్యాటర్లు.. విషమ పరీక్షలో ఎదురు నిలువకపోవడంతో మొదట భారత్ ఓ మాదిరి స్కోరుకే పరిమితం కాగా.. ఛేదన ఆరంభంలో కంగారూలు కాస్త తడబడ్డా ఆ తర్వాత మెరుగైన ప్రదర్శనతో ఆరోసారి విశ్వవిజేతలుగా నిలిచారు!

మ్యాచ్‌కు ముందు లక్ష ముప్పై వేల మంది అభిమానులను నిశబ్దంగా ఉంచడం కంటే పెద్ద సంతృప్తి ఏముంటుందన్న ఆసీస్ కెప్టెన్ కమిన్స్.. మైదానంలో అక్షరాల దాన్ని ఆచరించి చూపాడు.

నిరాశలో రోహిత్

అహ్మదాబాద్: ప్రతిష్ఠాత్మక వన్డే వరల్డ్‌కప్ మొత్తం నిలకడగా రాణించిన టీమ్‌ఇండియా చివరి మెట్టుపై తడబడింది. వరుసగా పది మ్యాచ్‌లు నెగ్గి ఫైనల్ చేరిన రోహిత్ సేన.. ఆఖరి పోరులో పరాజయం వైపు నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో ఆస్ట్రేలియా 6 వికెట్ల తేడాతో భారత్‌పై గెలిచి ఆరోసారి ప్రపంచకప్ కైవసం చేసుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌటైంది. కేఎల్ రాహుల్ (107 బంతుల్లో 66; ఒక ఫోర్), విరాట్ కోహ్లీ (63 బంతుల్లో 54; 4 ఫోర్లు) అర్ధశతకాలు సాధించగా.. కెప్టెన్ రోహిత్ శర్మ (31 బంతుల్లో 47; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) ఎప్పట్లాగే జట్టుకు మెరుపు ఆరంభాన్నిచ్చాడు. భారీ అంచనాల మధ్య బరిలోకి దిగిన యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (4), శ్రేయస్ అయ్యర్ (4), రవీంద్ర జడేజా (22 బంతుల్లో 9) విఫలమయ్యారు. జట్టుకు అత్యవసరమైన సందర్భంలో కీలకంగా మారగలడని ఆశించిన సూర్యకుమార్ యాదవ్ (28 బంతుల్లో 18; ఒక ఫోర్) సిక్సర్లతో విజృంభిస్తాడనుకుంటే.. అసలు బౌండ్రీ కొట్టేందుకే నానా తంటాలు పడ్డాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో స్టార్క్ 3, హజిల్‌వుడ్, కమిన్స్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. నాకౌట్ మ్యాచ్‌లు ఆడటంలో ఆరితేరిన ఆస్ట్రేలియా అద్భుత ఫీల్డింగ్‌తో ఆకట్టుకుంది. మైదానంలో చిరుతలను తలపించిన కంగారూలు.. స్టేడియంలో ఉన్నది 11 మందా లేక 22 మందా అన్నట్లు బంతి ఎటు వైపు వెళ్తే అక్కడ దర్శనమిచ్చారు. ఈ ప్రపంచకప్‌లో భారత్ ఆలౌట్ కావడం ఇదే తొలిసారి. అనంతరం లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా 43 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 241 పరుగులు చేసింది. ట్రావిస్ హెడ్ (120 బంతుల్లో 137; 15 ఫోర్లు, 4 సిక్సర్లు) సూపర్ సెంచరీతో చెలరేగితే.. మార్నస్ లబుషేన్ (110 బంతుల్లో 58 నాటౌట్; 4 ఫోర్లు) అర్ధశతకంతో రాణించాడు. డేవిడ్ వార్నర్ (7), మిషెల్ మార్ష్ (15), స్టీవ్ స్మిత్ (4), విఫలమయ్యారు. భారత బౌలర్లలో బుమ్రా 2, షమీ, సిరాజ్ చెరో వికెట్ పడగొట్టారు. హెడ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', కోహ్లీకి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు దక్కాయి.

1 ఈ టోర్నీలో అత్యధిక (31) సిక్సర్లు కొట్టిన ఘనత రోహిత్‌దే.

1 ఒక వరల్డ్‌కప్‌లో అత్యధిక పరుగులు చేసిన కెప్టెన్‌గా రోహిత్ (597) అగ్రస్థానంలో నిలిచాడు. గత వరల్డ్‌కప్‌లో న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ (578) చేసిన స్కోరును హిట్‌మ్యాన్ అధిగమించాడు.

3 ప్రపంచ కప్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన మూడో భారత ప్లేయర్‌గా కోహ్లీ నిలిచాడు. అంతకుముందు 2003లో సచిన్ టెండూల్కర్, 2011 యువరాజ్ సింగ్ ఈ పురస్కారం దక్కించుకున్నారు.

ప్రైజ్ మనీ	
	ఆసీస్: రూ. 33 కోట్లు
	భారత్: రూ. 16 కోట్లు

పరుగుల ధీరుడు
కోహ్లీ
765

వికెట్ల వీరుడు
షమీ
24

సంక్షిప్త స్కోర్లు

భారత్: 50 ఓవర్లలో 240 ఆలౌట్ (రాహుల్ 66, కోహ్లీ 54; స్టార్క్ 3/55, కమిన్స్ 2/34), **ఆస్ట్రేలియా:** 43 ఓవర్లలో 241/4 (హెడ్ 137, లబుషేన్ 58 నాటౌట్; బుమ్రా 2/43).

అందుకే అది ఆస్ట్రేలియా!

వన్డే ప్రపంచకప్‌లో భాగంగా తమ తొలి మ్యాచ్‌లో భారత్ చేతిలో ఓడిన ఆస్ట్రేలియా.. ఆ తర్వాత దక్షిణాఫ్రికాతో పోరులోనూ పరాజయం పాలైంది. ఆ మ్యాచ్ ప్రసారమవుతున్న సమయంలో వ్యాఖ్యాతగా ఉన్న పాకిస్థాన్ పేస్ దిగ్గజం వసీమ్ అక్రమ్ ఓ మాట అన్నాడు. 'ఒకవేళ ఈ మ్యాచ్‌లో కంగారూలు ఓడితే.. ఆ తర్వాత ప్రత్యర్థి ఎవరనే దానితో సంబంధం లేకుండా ఆసీస్ నిర్దయగా విరుచుకుపడుతుంది. ఇక దాన్ని ఆపడం ఎవరి తరం కాదు' అని అక్రమ్ అన్న మాటలను ఆసీస్ నిజం చేసింది. అక్కడి నుంచి ప్రతి మ్యాచ్‌లో అంతకంతకు రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగిన ఆసీస్.. వరుసగా ఏడు మ్యాచ్‌లు నెగ్గి సెమీఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది. అఫ్గానిస్థాన్‌తో పోరులో తొలుత బ్యాటింగ్ చేసిన కాబూలీలు ఆసీస్ ముందు 292 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించారు. రషీద్, ముజీబ్, నబీ, నూర్ రూపంలో నలుగురు ప్రమాదకర స్పిన్నర్స్ ఉండటంతో ఆసీస్‌కు కష్టమే అని అంతా అనుకున్నారు. అందుకు తగ్గట్లే ఆ జట్టు 91 పరుగులకే 7 వికెట్లు కోల్పోయింది. ప్రపంచంలో మరే జట్టైనా ఇంకో 20-30 రన్స్‌కు ఆలౌట్ అయి ఉండేది. కానీ, అక్కడ ఉన్నది ఆస్ట్రేలియా కదా.. అద్వితీయ పోరాటం కనబర్చింది. అప్పుడప్పుడు మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడటం తప్ప.. నిలకడగా భారీ ఇన్నింగ్స్‌లు ఆడగలడనే నమ్మకం లేని మ్యాక్స్‌వెల్ మొత్తం సీన్ రివర్స్ చేశాడు. ఒంటరి పోరాటం అంటే ఏంటో చేతల్లో చూపాడు. అఫ్గాన్ బౌలర్లపై శివతాండవమాడాడు. 128 బంతుల్లో 21 ఫోర్లు, 10 సిక్సర్లతో 201 పరుగులు చేసి అజేయంగా జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఇక దక్షిణాఫ్రికాతో సెమీఫైనల్లోనూ ఆస్ట్రేలియాకు దాదాపు ఇలాంటి పరిస్థితే ఎదురైంది. లీగ్ దశలో కంగారూలపై సునాయాసంగా గెలిచిన సఫారీలు.. నాకౌట్ పోరులో 212 పరుగులకే ఆలౌటయ్యారు. ఆసీస్ ఉన్న ఊపులో ఇదేమంత కష్టతర ఛేదన కాదనిపించింది. కానీ ప్రోటీస్ బౌలర్లు పట్టు వదలకపోవడంతో ఒక దశలో ఆసీస్ తుదిపోరుకు చేరడం కష్టమే అని అంతా భావించారు. అయితే ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో ఉగ్గుపాలతోనే నేర్చుకున్న కంగారూలు ఏమాత్రం తడబడకుండా విజయ తీరాలకు చేరారు. ఈ రెండు మ్యాచ్‌ల్లో ఆసీస్ పోరాట పటిమ చూసిన ఎవరికైనా.. ఒకప్పటి ఆస్ట్రేలియా టీమ్ స్పిరిట్ గుర్తు రాక మానదు. ఏ మాత్రం బెదురు లేకుండా బరిలోకి దిగిన ఆసీస్.. తొణకక బెణకక పని పూర్తి చేసింది. గత మ్యాచ్‌లో కోహ్లీ క్యాచ్ మిస్ చేయడంతోనే మ్యాచ్‌ను దూరం చేసుకున్నామని ఆట ఆరంభానికి ముందే చెప్పిన ఆసీస్.. అలాంటి పొరపాటు ఫైనల్లో చేయలేదు. పవర్‌ప్లేలో కంగారూల బౌలింగ్‌ను కకావికలం చేసిన రోహిత్ శర్మ ఇచ్చిన క్లిష్టమైన క్యాచ్‌ను వెనక్కి పరిగెడుతూ హెడ్ అందుకున్న తీరు వారి కసికి నిదర్శనం. తుదిపోరులో టీమ్‌ఇండియాను ఒక్కో పరుగు కోసం తీవ్రంగా శ్రమించేలా చేసిన కంగారూ ఫీల్డింగ్.. ఇరు జట్ల మధ్య ప్రధాన తేడాగా నిలిచింది. పరాజయాల నుంచి పాఠాలు నేర్చుకొని ముందుకు సాగిన వాడే అసలైన విజేత అని ఆసీస్ మరోసారి నిరూపించింది. రోహిత్‌సేన మొత్తం ఇన్నింగ్స్‌లో 13 ఫోర్లు, 3 సిక్సర్లకు పరిమితమైతే.. ట్రావిస్ హెడ్ ఒక్కడే 15 ఫోర్లు, 4 సిక్సర్లతో వార్ వన్‌సైడ్ చేశాడు. ఫలితంగా భారత అభిమానులకు మరోసారి నిరాశ తప్పలేదు. ఇక్కడితో లోకం అగిపోయేదేం కాదు.. ఆట ముగిసిపోయేదేం కాదు.. కానీ, స్వదేశంలో భారీ అంచనాలతో బరిలోకి దిగిన రోహిత్ సేన పరాజయాన్ని జీర్ణించుకోవడం అంత తేలిక కూడా కాదు!

-నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

అహ్మదాబాద్‌లో ఆదివారం భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీని మర్యాదపూర్వకంగా కలుసుకున్న హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు. తెలంగాణలో క్రికెట్ అభివృద్ధికి సహకారం అందించాలని గంగూలీని జగన్ కోరారు.

ప్రదీప్‌కుమార్‌కు పసిడి

హైదరాబాద్, ఆట ప్రతినిధి: బిష్కెక్(కజకిస్థాన్) వేదికగా జరిగిన ప్రపంచ స్థాయి పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్(ఓపెన్ వరల్డ్‌కప్)లో రాష్ట్రానికి చెందిన ప్రదీప్‌కుమార్ పసిడి పతకంతో మెరిశాడు. పురుషుల 82కిలోల కేటగిరీలో బరిలోకి దిగిన ప్రదీప్ 422.5 కిలోల బరువు ఎత్తి స్వర్ణ పతకం దక్కించుకున్నాడు. ప్రత్యర్థి లిఫ్టర్లకు దీటైన పోటీనిస్తూ ముందుకు సాగిన ప్రదీప్ సత్తా చాటాడు. ప్రస్తుతం రాచకొండ కమిషనరేట్‌లో అస్టిస్టెంట్ అకౌంట్స్ అధికారిగా కొనసాగుతున్న ప్రదీప్..జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసేలా పతకాలు సాధిస్తున్నాడు.

శ్రీనిధి ఎఫ్‌సీ అదుర్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక ఐ-లీగ్‌లో శ్రీనిధి దక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ అదరగొట్టింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి 5-0 తేడాతో తిద్దిమ్‌రోడ్ అథ్లెటిక్స్ యూనియన్‌పై భారీ విజయం సాధించింది. పూర్తి ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో శ్రీనిధి తరపున గురుముఖ్‌సింగ్, జగ్‌దీప్‌సింగ్, లాల్‌రోమా, డేవిడ్ కాస్టెండా గోల్స్ చేశారు. తమ తదుపరి మ్యాచ్‌లో ఈ నెల 23న రాజస్థాన్ యునైటెడ్ ఎఫ్‌సీతో శ్రీనిధి తలపడుతుంది.

మన్సూర్ అలీఖాన్ నోటిదురుసు
త్రిష అసహనం..

నోటి దురుసు వీపుకు చేటు అనేది పెద్దల నానుడి. అందుకే మాట్లాడేటప్పుడు నోటిని అదుపులో పెట్టుకోవాలి. తమిళ విలన్ మన్సూర్ అలీఖాన్ ఇలాగే నోటికి పనిచెప్పి అనవసరపు వివాదానికి తెరలేపాడు. రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో కథానాయిక త్రిష గురించి అభ్యంతరకరమైన కామెంట్లు చేసి అందరికీ టార్గెట్ అయ్యాడు. 'నేను చాలా సినిమాల్లో రేప్ సీన్స్‌లో నటించా. 'లియో' ఆఫర్ వచ్చినప్పుడు త్రిషతో కూడా ఇలాంటి సీన్ చేసే అవకాశం ఉంటుందేమో అనుకున్నా. కానీ అందులో అలాంటి సీన్ లేదు. చాలా బాధ పడ్డాను' అంటూ ఓ ఇంటర్వ్యూలో కామెంట్ చేశాడు మన్సూర్ అలీఖాన్. కాగా, ఈ వ్యాఖ్యలపై త్రిష చాలా సీరియస్‌గా స్పందించింది. ' అతను మాట్లాడిన వీడియా నేను చూశాను. అలాంటి నీచమైన వ్యక్తితో తెరను పంచుకోనందుకు చాలా ఆనందంగా ఉంది. ఇకపై కూడా నటించకుండా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకుంటా. ఇలాంటి వాళ్లు మన జాతికే సిగ్గుచేటు' అంటూ ఆవేశంగా మాట్లాడింది త్రిష. ఈ విషయంలో తమిళనాడు వ్యాప్తంగా త్రిషకు గట్టిగానే మద్దతు లభిస్తున్నది. దర్శకుడు లోకేశ్ కనగరాజ్, నటి మాళవికా మోహనన్, గాయని చిన్మయి తదితరులు మన్సూర్ అలీఖాన్ ప్రవర్తనను తప్పుపడుతూ త్రిషకు మద్దతు పలికారు. పరిస్థితులు చేజారడంతో మన్సూర్ ఈ విషయంపై మళ్లీ స్పందిస్తూ.. 'త్రిష అంటే నాకు చాలా గౌరవం.. నేనేదో సరదాగా అన్నాను. ఆ మాటలు ఇంత వివాదానికి దారి తీస్తాయనుకోలేదు' అంటూ క్షమాపణ కోరాడు. మాట పెదవి దాటితే తిరిగి తీసుకోలేం. ఈ విషయం ఇప్పటికైనా మన్సూర్ అలీఖాన్ గ్రహిస్తే మంచిదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రెండో ప్రపంచ యుద్ధ నేపథ్యంలో..

చిత్రం

ప్రస్తుతం ప్రభాస్ సినిమా అంటే వందల కోట్ల మాటే. మార్కెట్ ఆ రేంజ్‌లో ఉన్నప్పుడు ఏ హీరో అయినా నిర్ణయాల విషయంలో సమయం తీసుకుంటాడు. కానీ ప్రభాస్ మాత్రం జెట్ స్పీడ్‌లో డెసిషన్స్ తీసుకుంటూ విరామం లేకుండా సినిమాలు చేస్తున్నాడు. 'సలార్' డిసెంబర్లో రానుంది. ఆ తర్వాత 'ప్రాజెక్ట్ కె', దాని తర్వాత మారుతి 'రాజా డీలక్స్'.. ఇవి చాలవన్నట్టు ఇప్పుడు మరో సినిమాకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసినట్టు విశ్వసనీయ సమాచారం. 'సీతా రామం'తో భారీ బ్లాక్‌బస్టర్‌ని తన ఖాతాలో వేసుకున్న దర్శకుడు హను రాఘవపుడి దర్శకత్వంలో ప్రభాస్ ఓ సినిమా చేయనున్నట్టు తెలిసింది. 300కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ సినిమా రూపొందనుందని, రెండో ప్రపంచ యుద్ధ నేపథ్యంలో ఈ సినిమా కథ, కథనాలు సాగుతాయని తాజా సమాచారం. ప్రభాస్ ఇమేజ్‌కి తగ్గట్టుగా, ప్రపంచవ్యాప్త ప్రేక్షకులకు రీచ్ అయ్యేలా ఈ పాన్ ఇండియా మూవీని ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం. ప్రసిద్ధ బాలీవుడ్ నిర్మాణ సంస్థతో కలిసి యూవీ క్రియేషన్స్ వారు ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్లు వినికిడి.

'ధూమ్' దర్శకుడు కన్నుమూత

'ధూమ్' చిత్రంతో హిందీ చిత్రసీమలో మంచి గుర్తింపును సంపాదించుకున్న దర్శకుడు సంజయ్ గాధ్వి (56) ఆదివారం ఉదయం ముంబయిలో గుండెపోటుతో కన్నుమూశారు. 'తేరే లియే' చిత్రంతో బాలీవుడ్‌లో దర్శకుడిగా పరిచయమైన సంజయ్ గాధ్వి 'ధూమ్' 'ధూమ్-2' చిత్రాలతో కమర్షియల్ దర్శకుడిగా పేరు పొందారు. మేరే యాద్ కి షాదీ హై, కిడ్నాప్, అజబ్ గజబ్ లవ్ వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు. 2020లో విడుదలైన 'ఆపరేషన్ పరిందే' ఆయన చివరి చిత్రం. సంజయ్ గాధ్వి ఆకస్మిక మరణం పట్ల 'ధూమ్' చిత్ర బృందంతో పాటు పలువురు బాలీవుడ్ ప్రముఖులు సంతాపం ప్రకటించారు. సోమవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ఖుషీ రవి, శ్రీరామ్

ఒంటరిగా కూర్చొని చూడలేరు

శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' అనేది ఉపశీర్షిక. సాయికిరణ్ దైదా దర్శకుడు. యశ్వంత్ దగ్గుమాటి నిర్మాత. డిసెంబర్ 15న విడుదల కానున్న ఈ చిత్రం సెన్సార్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'సెన్సార్ సభ్యులు ఈ సినిమా చూసి ఎంతో అభినందించారు. డిసెంబర్ 7న ప్రీరిలీజ్ వేడుక నిర్వహించనున్నాం. మా యూనిట్ సభ్యులతోపాటు పలువురు చిత్రరంగ ప్రముఖులు కూడా ఈ వేడుకలో పాల్గొంటారు. డిసెంబర్ 15న ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం. ఇది పూర్తిస్థాయి హారర్ సినిమా. టాలీవుడ్‌లో ఇప్పటివరకూ చూడని హారర్ ఈ సినిమాలో చూస్తారు. ఒంటరిగా కూర్చొని ఈ సినిమా చూడలేరు. కథ, కథనం ఈ చిత్రానికి ప్రధాన బలం' అని తెలిపారు. ఈశ్వరీరావు, అవసరాల శ్రీనివాస్, రవివర్మ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: సతీశ్ మనోహర్, సంగీతం: కృష్ణసౌరభ్ సూరంపల్లి.

అది హత్యా? ఆత్మహత్యా?

స్పందన

ఆ రోజు రూప, ఆమె భర్త సబ్‌ఇన్‌స్పెక్టర్ అజయ్‌ల ఫస్ట్ మ్యారేజ్ యానివర్సరీ. ఓ అపార్ట్‌మెంట్ మేడపై ఏకాంతంగా జరుపుకుంటున్నారు. ఇంతలో అనుకోకుండా అజయ్ కాలుజారి బిల్డింగ్‌పై నుంచి కిందపడి చనిపోయాడు. అది మీడియాలో పెద్ద న్యూస్ అయింది. పోలీస్ ఇన్వెస్టిగేషన్ మొదలైంది. రూపే తన భర్తను చంపి ఆత్మహత్యగా చిత్రీకరిస్తుందని ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ అనుమానించాడు. ఆమెను ఇంటరాగేట్ చేశాడు. రూప మాత్రం తన భర్తది ఆత్మహత్యేనని గట్టిగా చెబుతుంది. ఇంతకీ అజయ్‌ది హత్యా? ఆత్మహత్యా? ఈ ప్రశ్నకు సమాధానంగా రూపొందిన చిత్రం 'ది ట్రయల్'. స్పందన పల్లి, యుగ్‌రామ్, వంశీ కోటు ప్రధాన పాత్రధారులు. రామ్ గన్నీ దర్శకుడు. స్మృతి సాగి, శ్రీనివాసనాయుడు కిల్లాడ కలిసి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్ర ట్రైలర్‌ను హీరో శ్రీవిష్ణు విడుదల చేసి, చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. ఈ చిత్రానికి కెమెరా: శ్రీసాయికుమార్ దారా, సంగీతం: శరవణ వాసుదేవన్.

ప్రయోగం ఫలించింది

రుక్సర్ థిల్లాన్, విక్రాంత్

స్వీయ దర్శకత్వంలో విక్రాంత్ హీరోగా నటించిన చిత్రం 'స్పార్క్ లైఫ్'. మెహరీన్, రుక్సర్ థిల్లాన్ కథానాయికలుగా నటించారు. శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా శనివారం థాంక్స్ మీట్‌ను నిర్వహించారు. హీరో విక్రాంత్ మాట్లాడుతూ 'విడుదలైన అన్ని కేంద్రాల్లో మంచి స్పందన లభిస్తున్నది. థియేటర్లలో ప్రేక్షకుల మధ్య సినిమా చూశాను. అందరూ పాజిటివ్‌గా స్పందిస్తున్నారు. చివరి ఇరవై నిమిషాలు ఉత్కంఠగా ఫీలవుతున్నారు. కథలో మలుపులు ఆసక్తిని పెంచుతున్నాయి. కంప్లీట్ ఎంటర్‌టైనర్‌గా ఆకట్టుకుంటున్నది. ఈ విజయంలో భాగమైన అందరికి కృతజ్ఞతలు' అన్నారు. 'ఇదొక ప్రయోగాత్మక చిత్రం. కొత్త కంటెంట్‌ను ప్రేక్షకులు ఆదరిస్తారనడానికి ఈ సినిమానే ఉదాహరణ. ఆద్యంతం అనూహ్య మలుపులతో థ్రిల్‌ను కలిగిస్తున్నది' అని రుక్సర్ థిల్లాన్ చెప్పింది.

సహస్ర రహస్యమేమిటి?

సుడిగాలి సుధీర్

సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న చిత్రం 'కాలింగ్ సహస్ర'. అరుణ్ విక్కిరాలా దర్శకత్వం వహించారు. షాడో మీడియా ప్రొడక్షన్స్, రాధా ఆర్ట్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. డాలీషా కథానాయిక. ఈ చిత్రాన్ని డిసెంబర్ 1న విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఇటీవల విడుదల చేసిన టీజర్, రెండు పాటలకు మంచి స్పందన లభించింది. వినూత్న కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. సుడిగాలి సుధీర్ పాత్ర కొత్త పంథాలో ఉంటుంది. సస్పెన్స్, థ్రిల్లింగ్ అంశాలతో ఆకట్టుకుంటుంది. సహస్ర ఎవరు? ఆమె వెనకున్న రహస్యమేమిటన్నది కథలో ఆసక్తికరమైన అంశంగా ఉంటుంది' అన్నారు. శివ బాలాజీ, మనోహరన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సన్నీ.డి, సంగీతం: మోహిత్ రెహమానియక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: మార్క్ కె రాబిన్, నిర్మాతలు: వెంకటేశ్వర్లు కాటూరి, విజేష్ తయల్, చిరంజీవి పమిడి, దర్శకత్వం: అరుణ్ విక్కిరాలా.

హ్రితిక

సీరియస్‌గా నవ్విస్తా..

' హీరోయిన్ ఆమని మా అత్తయ్య. చిన్నప్పట్నుంచీ సినిమాలంటే ఇష్టం. కొన్ని సినిమాల్లో బాలనటిగా కూడా నటించాను. హీరోయిన్‌గా 'సౌండ్ పార్టీ' నా రెండో సినిమా. 'అల్లంత దూరాన' త్వరాత నేను చేసిన సినిమా ఇది' అని చెప్పింది హ్రితిక శ్రీనివాస్. ఆమె వీజే సన్నీకి జోడీగా నటించిన చిత్రం 'సౌండ్ పార్టీ'. సంజయ్ శేరి దర్శకుడు. రవి పోలిశెట్టి, మహేంద్ర గజేంద్ర, శ్రీశ్యామ్ గజేంద్ర నిర్మాతలు. ఈ నెల 24న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా హ్రితిక విలేకరులతో మాట్లాడింది. ' సంజయ్ కథ చెప్పినప్పుడు ఎక్సైటింగ్‌గా అనిపించింది. ఇది పూర్తి ఫన్ ఎంటర్‌టైనర్. కామెడీతో పాటు కంటెంట్ కూడా ఉంది. ఇందులో నా పాత్ర పేరు సిరి. తెలివిగల అమ్మాయిని. చాలా సీరియస్ కేరక్టర్. సిట్యువేషన్ మాత్రం కామెడీగా ఉంటుంది. కథలో చాలా ప్రాముఖ్యత ఉన్న పాత్ర. ముఖ్యంగా క్లైమాక్స్ ఎవరూ ఊహించని విధంగా ఉంటుంది' అంటూ చెప్పుకొచ్చింది హ్రితిక. అమాయకులైన తండ్రీకొడుకులు ఈజీమనీ కోసం ఎలాంటి పనులు చేశారనేది ఈ సినిమా ముఖ్య కథాంశమని, ఈ కథకు సరైన టైటిల్ 'సౌండ్ పార్టీ' అని, ఎంజాయ్ చేస్తూ షూటింగ్ చేశామని అందరూ బాగా సపోర్ట్ చేశారని చెప్పింది హ్రితిక.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.